

నేడు కుప్పంకు సిఎం చంద్రబాబు

- రెండు రోజులు బిజీబిజీ
- కట్టుదిట్టమైన భద్రత.. ఏర్పాట్లు పూర్తి



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో
రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రి అయ్యాక, తన సొంత నియోజకవర్గమైన కుప్పంకు మంగళవారం ఉదయం 12.30 గంటలకు కుప్పంలోని పిఇఎస్ మెడికల్ కాలేజీ వద్ద హెలిప్యాడ్ వద్దకు హెలికాప్టర్‌లో చేరుకోనున్నారు. 12.55కు అక్కడనుంచి బయల్దేరి అదే నియోజకవర్గంలోని శాంతిపురం మండలం జల్లిగానిపల్లి, చిన్నారిదొడ్డి గ్రామాల్లో హంద్రీనీవా కాల్వను 40 నిమిషాల పాటు పరిశీలించనున్నారు. అక్కడనుంచి నేరుగా ఆర్ అండ్ బి అతిథిగృహం చేరుకుని గంటపాటు విశ్రాంతి తీసుకోనున్నారు. కుప్పం ఆర్టీసీ బస్టాండ్ (ఎన్టీఆర్ సర్కిల్)వద్ద బహిరంగసభలో ప్రసంగించనున్నారు. ఈ సభకు వేలాదిమందిని తరలించేందుకు కుప్పం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్, పలమనేరు ఎంఎల్‌ఎ అమరనాథరెడ్డి, సిఎం చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పిఎస్ మనోహర్, కుప్పం సమన్వయ కమిటీ నాయకులు పిఎస్ మునిరత్నం, గౌనివాని శ్రీనివాసులు, డాక్టర్ సురేష్, డాక్టర్ వెంకటేష్, కన్నన్‌లు జనసమీకరణలో తలమునకలై ఉన్నారు. అనంతరం ఆర్ అండ్ బి అతిథిగృహంలో సాయంత్రం 4.35 గంటలకు కుప్పం నియోజకవర్గం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ఆరోజు అక్కడే బస చేయనున్నారు. అదే అతిథిభవనంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు అర్జీలను స్వీకరిస్తారు. పిఇఎస్ మెడికల్ కళాశాల పక్కన ఉన్న ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కుప్పం నియోజకవర్గంలోని అధికారులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. భోజన విరామం అనంతరం 2.35 గంటలకు కుప్పం పార్టీ క్యాడర్‌తో సమావేశం కానున్నారు. 4.10 గంటలకు పిఇఎస్ మెడికల్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌నుంచి విజయవాడ గన్నవరం చేరుకుంటారు. సిఎం చంద్రబాబు సమక్షంలో పలువురు వైసిపి కీలక నేతలు టిడిపిలో చేరేందుకు టిడిపి నాయకులు పావులు కదుపుతున్నట్లు సమాచారం.

కుప్పంలో టిడిపిని ఖాళీ చేస్తామని గతంలో ఎంఎల్‌సి భరత్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనేకమార్లు అన్నారు. దీన్ని సవాల్‌గా తీసుకుని ఎంఎల్‌సి కంచర్ల శ్రీకాంత్ తనదైన శైలిలో వ్యూహంతో ముందుకెళ్లనున్నారు.


సమన్వయంతో సీఎం పర్యటన విజయవంతం చేయండి

- కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: సీఎం చంద్రబాబు కుప్పం పర్యటనను అధికారులందరూ సమన్వయంతో సమిష్టిగా పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కుప్పం తహశీల్దార్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఎఫ్ఓ చైతన్యకుమార్ రెడ్డిలతో కలసి ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం, పోలీసులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. సీఎం పర్యటన కోసం పటిష్ట బందోబస్తు నిర్వహించాలన్నారు. హెలిప్యాడ్, పార్కింగ్ వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. వాహనాల పార్కింగ్ సమస్య లేకుండా చూడాలన్నారు. ఎక్కడ ట్రాఫిక్ ఇబ్బంది రాకుండా చూసుకోవాలని, పోలీస్, రెవెన్యూ, ఆర్అండ్‌బి అధికారులు కలిసి పరిశీలన చేసి బ్యారికేడ్‌లు ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. హెలిప్యాడ్ నుంచి కాన్వాయ్ వెళ్లేటప్పుడు ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకోవాలనన్నారు. ఫైర్ సేఫ్టీ జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. ఈ సమీక్షకు ముందు కలెక్టర్, ఎస్పీ మణి కంఠ చందోలుతో కలిసి సీఎం పర్యటించే అన్ని ప్రదేశాలను పరిశీలించారు. తగు సూచనలు చేశారు. ఈ సమీక్షలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్‌గా సుమిత్ కుమార్ బాధ్యతలు



ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా సుమిత్ కుమార్ నియమితులైయ్యారు. సోమవారం ఆయన జిల్లా సచివాలయంలో కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్‌కి పలువురు స్వాగతం పలికారు. కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి వేద పండితుల ఆశీర్వాదాలు పలికారు. డీఆర్‌వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్, కలెక్టరేట్ ఏవో వెంకటేశ్వర్లు, కాణిపాకం ఈవో వెంకటేశు, రెవెన్యూ అసోసియేషన్ కలెక్టరేట్ యూనిట్ ప్రెసిడెంట్ పార్థసారథి, ఇతర సంబంధిత అధికారులు నూతన కలెక్టర్‌కి ఘన స్వాగతం పలికారు. ఆ తరువాత చిత్తూరు నగర పాలక కమిషనర్ డాక్టర్ జె.అరుణ కలెక్టర్‌ని మర్యాద పూర్వకంగా కలిసి శుభాభినందనలు తెలిపారు. కమిషనర్ వెంట సహాయ కమిషనర్ రామకష్ణుడు, ఎంఈ గోమతి ఇతర అధికారులు ఉన్నారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తానని తెలిపారు.

ప్రతి అర్జీకి స్పందించాలి: కలెక్టర్



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్)లో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సచివాలయంలోని సమావేశపు మందిరంలో పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్‌కు హాజరై అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. కలెక్టర్‌తో పాటు డిఆర్ఓ పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్‌లు వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు.

అత్యధికంగా రెవెన్యూకి సంబంధించినవే..

జిల్లా కేంద్రంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పెద్దఎత్తున సమస్యలతో అర్జీ చేతపట్టి కలెక్టరేట్‌కి విచ్చేశారు. అందులో భాగంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన అర్జీలు అత్యధికంగా వచ్చాయి. రెవెన్యూ శాఖకు సంబంధించి 77, నేషనల్ హైవే 02, చిత్తూరు మున్సిపల్ శాఖ 10, విభిన్న ప్రతిభా వంతుల శాఖ 01, పోలీసు శాఖ 01, జిల్లా ఎంప్లాయ్ మెంట్ 01, డిసిఓ ఆరోగ్య శ్రీ 01, బిసి వెల్ఫేర్ 2, ఎస్‌ఈ ఇరిగేషన్ 1, డిపిఓ 2, ఎంపిడిఓ తవణంపల్లి 1, ఏడిఎస్‌ఎల్‌ఆర్ 1 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా అందే అర్జీల పరిష్కారంపై అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని జవాబుదారీతనంతో సకాలంలో తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబందించిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థలో తొమ్మిది వినతులు

చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమంలో తొమ్మిది వినతులు అందినట్లు నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ తెలిపారు. సహాయ కమిషనర్ రామకష్ణుడు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజారోగ్య విభాగం-4, ఇంజనీరింగ్ విభాగం-3, టౌన్ ప్లానింగ్-1, మెప్మా-1 చొప్పున మొత్తం తొమ్మిది వినతులు అందినట్లు అధికారులు తెలిపారు.

మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

- కలెక్టర్ ఆదేశాలను అమలు చేయాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు వినతి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: జిల్లాలో మామిడి పంట విస్తారంగా ఉన్నప్పటికీ ఈ సంవత్సరం దిగుబడి నామమాత్రంగానే ఉంది. దిగుబడి తక్కువగా ఉండడంతో ధరలు బాగా ఉంటాయని రైతులు ఆశించారు. వ్యాపారస్తులు, పరిశ్రమ యాజమాన్యాలు వైఖరుల వలన రైతుల ఆశలు అడియాశలైయ్యాయి. గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతులు కలెక్టర్ వేడుకోగా గత కలెక్టర్ స్పందించి యాజమాన్యాలతో వ్యాపారస్తులతో సమావేశం జరిపి తోతాపూరి పంటకు టన్నుకు రూ.30వేలు నిర్ణయించారు. ఈ ధర కూడా అంతంత మాత్రమే అయినప్పటికీ రైతులు పంటను తీసుకెళ్తే కలెక్టర్ నిర్ణయాన్ని తుంగలోతొక్కి రోజురోజుకు తగ్గిస్తూ ప్రస్తుతం 23 వేల రూపాయలకే ధర ఇవ్వడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని సోమవారం కలెక్టరేట్లో జరిగిన ప్రజాదర్బార్‌లో కలెక్టర్‌కి సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలను అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. నూతనంగా వచ్చిన కలెక్టర్ స్పందిస్తూ మరొకసారి సమావేశం జరిపి రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎంపి దగ్గుమళ్ళ ప్రసాద రావు ప్రమాణ స్వీకారం

- ప్రజాసేవకుడిగా పని చేస్తానని వెల్లడి



ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు పార్లమెంటు సభ్యునిగా సోమవారం లోక్ సభలో దగ్గుమళ్ళ ప్రసాద్ రావు ప్రమాణ స్వీకారం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రెండు లక్షలా ఇరవై మూడు వేల పైచిలుకు ఓట్లతో గెలుపొందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మొట్ట మొదటిసారిగా చట్టసభల్లోకి అడుగుపెట్టిన ప్రసాద్ రావు తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వెలుపలకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. తమ అధినేత చంద్రబాబు తన మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము కానీవ్వకుండా రాష్ట్ర అభివద్ధి, ప్రజాసంక్షేమం కోసం ప్రజాసేవకుడిగా పనిచేస్తానని తెలిపారు. అదే సమయంలో ప్రజాస్వామ్య విలువల్ని కాపాడుతానని వివరించారు. ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు ప్రజా సమస్యల పరిష్కరించి, ప్రజల ఆశయాలకనుగుణంగా తన కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు స్పష్టం చేశారు.

పలువురి శుభాకాంక్షలు

చిత్తూరు ఎంపీగా లోక్ సభలో సోమవారం ప్రమాణం స్వీకారం చేసిన దగ్గుమళ్ళ ప్రసాదరావుకు పలువురు ప్రజాప్రతినిధులు, అభిమానులు, టీడీపీ శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు.

ఏనుగుల హల్ చల్

- శివాలయం గోడలు ధ్వంసం చేసిన గజరాజులు



ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలంలోని కోగిలేరు పంచాయతీ సమీపంలోని శ్రీ జలకంటేశ్వర స్వామి ఆలయం వద్ద ఆదివారం రాత్రి ఏనుగులు హల్ చల్ చేశాయి. శివాలయం గోడలు, ఆలయానికి అమర్చిన ఇనుప గేటు ధ్వంసం చేసినట్లు ఆలయ కార్య నిర్వహకులు తెలిపారు. సుమారు రూ.30వేలు నష్టం వాటిలోనట్టు తెలిపారు. అటవీ శాఖ అధికారులు స్పందించి ఆలయం వైపు ఏనుగులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తాం..

- కాణిపాకంలో అధికారులతో ఎమ్మెల్యే మురళిమోహన్ సమీక్ష



ప్రజాశక్తి-ఐరాల: కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో భక్తులకు ఆధ్యాత్మిక భావన కలిగించే విధంగా అధికారుల వస్త్రధారణ ఉండాలని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళిమోహన్ అధికారులను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం కాణిపాకం ఆలయ సమావేశ మందిరంలో ఆలయ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న రోజు వారి కార్యక్రమాలపై అధికారులతో ఆరా తీయడంతో పాటు సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తులకు, సామాన్య భక్తులకు కల్పించే సౌఖర్యాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా కాణిపాకం ఆలయ అభివృద్ధికి సంబంధించి సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఆదేశాలతో కాణిపాకం ఆలయంలో మార్పుకు శ్రీకారం చుడుతున్నామన్నారు. ముందుగా ఆలయంలో మార్పులు అధికారుల నుండే మొదలు పెడుతున్నామని, అందుకే ఆలయంకు వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక భావన కల్పించే విధంగా అధికారులు, సిబ్బంది మంచి వస్త్ర ధారణతో పాటుగా విభూతి తిలకంతో ఉండేలా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. మరో యాభై సంవత్సరాలు దృష్టిలో ఉంచుకుని కాణిపాక ఆలయంలో భక్తులకు అందించాల్సిన సౌఖర్యాలపై చర్చించడం జరిగిందన్నారు. అదేవిధంగా ఆలయంలో భక్తులకు అవసరం అయ్యే సౌకర్యాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాంమని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

అన్నప్రసాదం వితరణ

కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద అన్నప్రసాదం వితరణ కార్యక్రమంలో పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళి మోహన్ పాల్గొన్నారు. ఎన్నికలకు ముందు ఆలయ ఉభయదారులైన కాకర్ల హేమాద్రి నాయుడు, అతని కుటుంబ సభ్యులు రాష్ట్రానికి సీఎంగా చంద్రబాబు, పూతలపట్టు ఎమ్మెల్యేగా డాక్టర్ కలికిరి మురళీమోహన్ కావాలని శ్రీ కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి వారిని వేడుకోగా కోరిక తీరిన మేరకు ఆలయంలో 9వారాల పాటు అన్నప్రసాదం వితరణ చేస్తామని కోరిన హేమాద్రినాయుడు, కుటుంబ సభ్యులు తెలిపారు.

బోధనేతర ఎన్నికలకు సహకరించండి



ప్రజాశక్తి - క్యాంపస్
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో బోధనేతర సంఘం నూతన కమిటీ ఏర్పాటుకు నిర్వహిస్తున్న ఎన్నికలలో ప్రతి ఒక్కరు సహకరించి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా సహకరించాలని ఎన్నికల అధికారి మహమ్మద్ షఫీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ క్యాంపస్ లో ప్రశాంతంగా బోధనేతర సిబ్బంది సంఘం ఎన్నికలు నిర్వహించడానికి అభ్యర్థులు అందరూ తప్పనిసరిగా ఈ క్రింది సూచనలు పాటించాలని కోరారు. 1.ప్లాస్టిక్ బ్యానర్ నిషేదం, 2.గోడలపై నోటీసులు అటించడం నిషేధం, 3.భవనాలు, రహదారులపై రాతలు రాయడం నిషేధమనీ అన్నారు. పై సూచనలు అతిక్రమించిన యెడల యూనివర్సిటీ అధికారులకు ఫిర్యాదు చేయబడునని పేర్కొన్నారు.

తిరుమల శ్రీవారి ఆలయంపై ఈవో సమీక్ష



ప్రజాశక్తి -తిరుమల
తిరుమల శ్రీ వేంకటేశ్వర ఆలయం, చరిత్ర, వాస్తుశిల్పం, విశిష్టత, అనేక ఇతర సంబంధిత విశేషాలపై టీటీడీ ఈవో జె.శ్యామలరావు సమీక్షించారు. సోమవారం సాయంత్రం తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో జరిగిన సమీక్షా సమావేశంలో జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తిరుమల శ్రీవారి ఆలయ చరిత్ర, వైఖానస ఆగమ, జీయంగార్ వ్యవస్థ, వివిధ ఆచార వ్యవహారాలు, నిత్య, వార, మాస, వార్షిక సేవా కార్యక్రమాలు, సుప్రభాతం నుంచి ఏకాంతం వరకు ప్రతిరోజు శ్రీవేంకటేశ్వర స్వామికి నిర్వహించే వివిధ కైంకర్యాలను సవివరంగా ఈవోకు వివరించారు. అంతకుముందు ఇంజినీరింగ్ అధికారులతో కలిసి నారాయణగిరి షెడ్లను ఈఓ పరిశీలించారు. సీవీఎస్‌వో నరసింహకిషోర్, సిఈ నాగేశ్వరరావు, ఎస్‌ఈ -2 జగదీశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎన్‌బిఎఫ్‌సి నూతన శాఖ ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ
ప్రముఖ నాన్- బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ (ఎన్ బి ఎఫ్ సి), ఫారిన్ ఎక్స్చేంజ్ నగదు బదిలీ సేవలు అందించే యూనిమోని ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ తమ శాఖను తిరుపతిలో సోమవారం ప్రారంభించింది. స్థానిక డి మార్ట్ ఎదురుగ, ఎయిర్ బై పాస్ రోడ్, యాదవ కాలనీ రాయల్ నగర్ ఏర్పాటుచేసిన నూతన కార్యాలయం వద్ద యూనిమోని ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సీపీ కృష్ణన్ ఆర్ మాట్లాడుతూ కస్టమర్ల సేవ, లభ్యతను మెరుగుపరచడానికి తాము తిరుపతి శాఖను అందరికీ అందుబాటులో ఉండే ప్రదేశానికి మార్చామన్నారు. కొత్త శాఖ తిరుపతి, చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న కస్టమర్లకు మెరుగైన సేవలను, ఆర్థిక మద్దతును అందించడం లో తమ నిబద్ధతను సూచిస్తుందని తెలిపారు. అనంతరం స్కూల్ విద్యార్థులకు ఉచితంగా బ్యాగులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మనోజ్ వి మ్యాథ్యు (చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్), రతీష్ ఆర్ (చీఫ్ పీపుల్ ఆఫీసర్), ప్రకాష్ భాస్కర్ (నేషనల్ బిజినెస్ హెడ్ ఫారెక్స్), సిద్ద ప్రసాద్(బ్రాంచ్ హెడ్ తిరుపతి) పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లకు మోక్షమెప్పుడో..

- లబ్దిదారుల నిరీక్షణ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: టిడ్కో ఇండ్లు ఎప్పుడు అప్పగిస్తారో..? అని లబ్దిదార్లు ఎదురు చూస్తున్నారు. సొంత ఇంటి కోసం బ్యాంకు ఋణాలు పొంది టిడ్కో ఇండ్ల కోసం డబ్బులు చెల్లించిన లబ్దిదార్లు బ్యాంకు వడ్డీలు చెల్లించేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. గత టీడీపీ ప్రభుత్వంతో ఇళ్లు నిర్మించుకొనే ఆర్థికస్తోమత లేని పేదల కోసం ప్రభుత్వమే ఇండ్లు నిర్మించి ఇస్తుందంటూ ప్రభుత్వం టిడ్కో ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. చిత్తూరు నగర పాలక సంస్థలో 450మంది టిడ్కో ఇండ్లపై ఆసక్తి చూపారు. డబుల్ బెడ్ రూం, సింగ్ బెడ్ రూం రెండు విభాగాల్లో 20శాతం సొంత డబ్బులు, 60శాతం బ్యాంకు ఋణం ప్రభుత్వం 30శాతం నిధులతో టిడ్కో ఇండ్లను నిర్మించి ఇవ్వాల్సి ఉంటుంది.

ఇలా గత టీడీపీ ప్రభుత్వంలో 2017లో చిత్తూరు నగర పాలక సంస్థ పరిధిలో ఎంపిక చేసిన లబ్దిదార్లకు పూనేపల్లి వద్ద 40ఎకరాల్లో అపార్టుమెంట్ నిర్మాణానికి నాటి మంత్రి అమరనాధరెడ్డి, ప్రజాప్రతినిధులు నిర్మాణాలకు భూమిపూజ చేశారు. 450 గృహాలు నిర్మాణపనులు శరవేగతంగా 80శాతం పూర్తయ్యాయి. 20శాతం పనులు పూర్తి చేసి లబ్దిదార్లు అందిస్తామంటూ ప్రజాప్రతినిధులు, అధికార్లు ప్రకటించినా 2019 సార్వత్రిక ఎన్నికలు రావడం ఆ ఎన్నికల్లో టీడీపీ ఓటమి చవిచూడడంతో టిడ్కో ఇండ్ల నిర్మాణానికి బ్రేకులు పడ్డాయి. నాటి నుంచి స్వంత ఇంటి నిర్మాణం కోసం బ్యాంకుల నుంచి ఋణాలు తీసుకున్న లబ్దిదార్లు వడ్డీ చెల్లించడం భారంగా మారింది. ఓవైపు ఇంటి బాడుగలు కట్టుకోవడంతో పాటు బ్యాంకు వడ్డీ అధనంగా చెల్లించాల్సి వచ్చింది.

2024 సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని జగన్ ప్రభుత్వం గత ఏడాదిగా టిడ్కో ఇండ్లపై లబ్దిదార్లలో ఆశలు రేపింది. ఎన్నికల ముందు టిడ్కో ఇండ్ల నిర్మాణం పూర్తి అందించాలంటూ అధికార్లకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు పూనేపల్లి వద్ద అసంపూర్తిగా నిలిచిపోయిన టిడ్కో ఇండ్లకు రంగుల వేసి, తాగునీరు, డ్రైనేజి పనులు పూర్తి చేసి వంద శాతం లబ్దిదార్లకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించడంతో పాటు ఎన్నికలకు ముందు కొందరు లబ్దిదార్లకు అప్పగించారు. నివాసయోగంగా లేదంటూ టిడ్కో ఇండ్లను ఉండేందుకు లబ్దిదార్లు అసక్తి చూపడం లేదు. ఈ ప్రాంతంలో ఇండ్లకు కేటాయించిన లబ్దిదార్ల అందరికీ ఇండ్లు అప్పగించడం ద్వారా జన సందడితో టిడ్కో ఇండ్లలో నివాసం ఉండే అవకాశముంటుందని లబ్దిదార్లు భావిస్తున్నారు. మరో వైపు నీటి వసతి, డ్రైనేజి వ్యవస్థ పూర్తి స్థాయిలో లేకపోవడం ఓ కారణంగా లబ్దిదార్లు చెబుతున్నారు.

కుటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం సీఎం చంద్రబాబు తమ ప్రభుత్వంలో నిర్మాంచిన టిడ్కో ఇండ్లపై ప్రత్యేక శ్రద్ద తీసుకుటారని లబ్దిదార్లు భావిస్తున్నారు. పూర్తి స్థాయిలో మౌళిక వసతులు కల్పించి లబ్దిదార్లకు అందించాలని కోరుతున్నారు. ఐదు సంవత్సరాగా టిడ్కో ఇండ్లకు కోసం ఎదురు చూడాల్సి వచ్చిందని బ్యాంకుల నుంచి తీసుకున్న ఋణానికి వడ్డీ చెల్లించాలంటూ నోటీసులు అందుతున్నట్లు చెబుతున్నారు. బ్యాంకు వడ్డీ మాఫీ చేయాలని కోరుతున్నారు. మంగళ, బుధవారాల్లో జిల్లాలో పర్యటిస్తున్న సీఎం టిడ్కో ఇండ్లపై లబ్దిదార్లకు అప్పగింత, వడ్డీ మాఫీ, మౌళిక వసతుల కల్పనపై స్పష్టమైన హామీ ఇవ్వాలని టిడ్కో ఇండ్ల లబ్దిదార్లు కోరుతున్నారు.


పూనేపల్లి వద్ద నిర్మించిన టిడ్కో ఇండ్లు

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించండి

- పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో నారాయణ ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

ప్రజాశక్తి-సోమల: గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో నారాయణ ఆదేశించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆయన పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బందిలో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 25 నుంచి జూలై 17వ తేదీ వరకూ పంచాయతీల్లో పారిశుద్ధ్యం, తాగునీటి ఇబ్బంది, ప్రజారోగ్యంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా గ్రామాలలో పారిశుద్ధ్యం, తాగునీరు పంపిణీ చేసే పైప్ లైన్‌లలో లీకేజీలు సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించడం, ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రం చేయడం, గ్రామాలలో బ్లీచింగ్ చల్లడం, పేడ దిబ్బలు తొలగించడం, మురుగునీటి కాలువల శుభ్రం తదితర కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వైద్యాధికారులు విజయలక్ష్మి, బాలాజీ మాట్లాడుతూ డయేరియా(అతి సారవ్యాధి) ప్రబలకుండా గ్రామాలలో పంచాయతీ ఇతర శాఖల సమన్వయంతో వైద్య సిబ్బంది పనిచేసి పారిశుద్ధ్య కార్యక్రమం పనుల్లో పాల్గొని అంటూ వ్యాధులు ప్రబలకుండా చేపట్టవలసిన చర్యలపై సహకారం అందించాలని కోరారు.

పేదల జీవితాల మార్పే లక్ష్యం

- చిన్న తరహా పరిశ్రమలపై అవగాహన
- సుచి స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ గ్లోరీ విజయ్ కుమార్



ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: గ్రామీణ ప్రాంతాల పేదల జీవితాల మార్పు కోసమే చిన్న తరహా వ్యాపారంపై శిక్షణ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సుచి స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ గ్లోరీ విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం సంస్థ డైరెక్టర్ పాల్ విజయ్‌కుమార్‌తో కలిసి సింధియా ఫీల్డ్ కార్యాలయంలో అబ్రహం సంతానం డైరెక్టర్ సింధియా, ఎగ్జిక్యూట్ డైరెక్టర్ కరుణానిధి, క్లస్టర్ కోఆర్డినేటర్, చార్లెస్ రమేష్ సిఎంసి వేలూరు రుష హాస్పిటల్ సీనియర్ ట్రైనింగ్ ఆఫీసర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల యువతి, యువకులకు చేతి వృత్తుల నైపుణ్యం స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాం వాతావరణ మార్పులు క్లైమేట్ చేంజ్ ద్వారా బడుగు బలహీన పేద యువతీ యువకులకు జీవన నైపుణ్యం చేతివృత్తులపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. డ్రైవింగ్, టైలరింగ్, ఆటోమొబైల్, మెకానిజం, కంప్యూటర్, ఆదాయ ఉత్పత్తి శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు మంజూరు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా టైలరింగ్ శిక్షణ పొందిన 6మందికి సంస్థ ద్వారా సర్టిఫికెట్లు మంజూరు చేశారు. కార్యక్రమంలో రూష ఆసుపత్రి ప్రతినిధులు అనీష్ ట్రైనింగ్ ఆఫీసర్ సృశి స్కిల్ ట్రైనింగ్ ఆఫీసర్ సంపత్ ఇన్స్ట్రక్టర్ ఆటో మొబైల్ మెకానిజం సుచి సిబ్బంది ధనలక్ష్మి, జాకబ్, జాన్సన్, వరదరాజ్, థామస్, చిన్నయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్

సారా స్వాధీనం

- ముగ్గురి అరెస్ట్

ప్రజాశక్తి-సోమల: నాటు సారా స్వాధీనం చేసుకొని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటనరసింహులు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని కందూరు సమీపంలోని గ్రామ శివారులలో శంకర్ నాటు సారా అమ్ముతుండగా దాడి చేసి అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 10లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా తుడుంవారిపల్లి ఎస్టీ కాలనీకి చెందిన వెంకటరమణ వద్ద 10లీటర్ల సారా, పేగలవారిపల్లెకు చెందిన రెడ్డప్ప వద్ద పది లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

లారీ, బైక్ ఢీ

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: లారీని బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడి ఆసుపత్రిపాలైన సంఘటన ఆదివారం రాత్రి బైరెడ్డిపల్లి – కుప్పం జాతీయ రహదారిలోని దేవదొడ్డి వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేర కు.. తెలంగాణ రాష్ట్రం నల్లగొండ జిల్లా మిరియాల గూడ నుంచి మొక్కజొన్న లోడు తో కర్నాటక రాష్ట్రం హోసూరుకు లారీ వెళుతోంది. వెంగంవారిపల్లికి చెందిన సంపంగి (65), సుబద్రమ్మ(53)లు సొంత పనులు ముగించుకొని వీకొట నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో తిరుగు ప్రయాణమై య్యారు. ఈ క్రమంలో దేవదొడ్డి వద్ద ఎదురుగా వస్తున్న లారీని బైక్ ఢీకొంది. సంఘటన లో సంపంగి, సుబద్రమ్మలు తీవ్రగాయాలపాలైయ్యారు. వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు దుకాణాలు మూసివేత

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లిలో మంగళవారం దుకాణాలు మూసివేస్తున్నట్లు మర్చంట్ అసోసి యేషన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతినెల ఆఖరి మంగళవారం దుకాణాలకు సెలవు ప్రకటిస్తుండడంలో భాగంగా విధిగా దుకాణాలు మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. అందరూ సహకరించాలని కోరారు.

ఆవులపల్లెలో వలస దేవరలు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఆవులపల్లె గ్రామస్తులు సోమవారం గ్రామం మొత్తం వలస దేవరలు నిర్వహించారు. ఉదయం 7గంటల లోపే గ్రామంలోని మహిళలు పిల్లలు వృద్ధులు, పురుషులు అందరూ కలసి గ్రామం వదిలి పొలాలు, ఇతర ప్రాంతాలకు వెళ్లారు. అక్కడే సాయంత్రం ఐదు వరకు ఉండి వనభోజనాలు చేసుకొని గ్రామ దేవతలకు పూజలు నిర్వహించారు. ఆరు గంటలకు తిరిగి గ్రామానికి చేరుకున్నారు. గ్రామంలో ప్రజలకు పశుపత్యాధులకు ఎలాంటి అంటూ వ్యాధులు రాకూడదని పంటలు బాగా పండాలని సకాలంలో వర్షాలు కురవాలని కోరుకుంటూ వలస దేవరలు నిర్వహించినట్టు తెలిపారు. ప్రజలు పొలాల వద్ద ఆనందోత్సాహాలతో ఆటలు ఆడి, పాటలు పాడి వనభోజనాలను చేసుకుని తిని తిరిగి గ్రామంలోకి పూజలు నిర్వహించారు.

విద్యార్థులకు అభ్యసనా సామగ్రి వితరణ

ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: నగరి మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల (బాలికలు)లో పూజ, రిత్విన్‌శ్రీ అనే దాతలు అభ్యసనా సామగ్రిని వితరణగా అందించారు. సోమవారం పాఠశాలకు వెళ్లిన వారు ప్రధానోపాధ్యాయులు సురేష్ ద్వారా విద్యార్థులకు పలకలు, నోట్‌బుక్స్, బ్యాగ్లు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ మీన, టీడీపీ నాయకులు గుణశేఖర్, జ్యోతి నాయుడు, చిట్టి, రాజశేఖర్, ఎల్ కె రాజ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ కార్యకర్తగా ఎంపిక



ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: టీడీపీ అజెండాలను గ్రామ స్థాయిలో విజయవంతంగా తీసుకెళ్లేందుకు కృషి చేసిన కార్యకర్తలను ఆ పార్టీ నాయకులు సోమవారం ఎంపిక చేశారు. జీడీ నెల్లూరు నియోజకవర్గం ఎస్ఆర్ పురం మండలం తయ్యూరు పంచాయతీకి చెందిన పూజారి నాగరాజును ఉత్తమ కార్యకర్తగా ఎంపిక చేశారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే థామస్ చేతుల మీదుగా అవార్డులను నాగరాజు అందుకున్నారు. కార్యక్రమంలో నాయకులు జయశంకర్ నాయుడు పాల్గొన్నారు.

'సీఎం సభను విజయవంతం చేయండి'

ప్రజాశక్తి-గుడిపల్లి: కుప్పం నియోజకవర్గంలో సీఎం చంద్రబాబు రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం కుప్పం ఆర్టీసీ కూడలిలో మధ్యాహ్నం ఒంటిగంటకు నిర్వహించు బహిరంగ సభను విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షులు టి.ఎం. బాబు నాయుడు పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు.

నగదు బహుమతి అందజేత


బహుమతులు ప్రదానం చేస్తున్న పూర్వవిద్యార్థులు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మెరిట్ విద్యార్థులకు 1982–83లో 10వ తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు నగదు బహుమతిని అందజేశారు. ఈ ఏడాది 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహంతో పాటు పాఠశాలకురూ.17,500వేలు విలువచేసే బీరువాను సోమవారం అందజేశారు. ఇకపై ప్రతి విద్యా సంవత్సరం మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు ప్రోత్సాహ బహుమతులు అందిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం హేమలత, లోకనాథరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జయచంద్ర నాయుడు, చంద్రన్, మధుసూదన్, వాసు, అరుల్ దాస్, సురేఖ, తులసి, టీచర్లు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని అగ్గిచేనుపల్లి పాఠశాలలో విద్యార్థులకు టీడీపీ నాయకులు, స్కూల్ కమిటీ ఛైర్మన్ శివకుమార్ సోమవారం తన వంతు సాయంగా విద్యా సామగ్రిని అందజేశారు. వెదురుకుప్పం టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ మోహన్‌మురళి చేతుల మీదుగా నోట్ పుస్తకాలు, సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు మహేశ్వర రావు, దామోదర్, హెచ్ఎం అక్బర్, ఉపాధ్యాయులు రవి, అంగన్వాడీ టీచర్ ప్రేమలత, టీడీపీ నాయకులు వరప్రసాద్, కార్తీక్ జయంత్, సింహాద్రి, సూర్య, ఢిల్లీ పాల్గొన్నారు.

పేదలకు వరం చంద్రన్న బీ(డీ)మా..!

'మిత్ర'లను ఆదుకోండి

ప్రజాశక్తి - రామచంద్రాపురం

'చంద్రన్న బీమా.. పేదల పాలిట వరం కానుంది.. అలానే బీమా మిత్రులనూ కొనసాగించి తమకు ఉపాధి చూపాలని' బీమా మిత్రలు కోరుతున్నారు. గత చంద్రబాబు పాలనలో రూ.5లక్షలు ఉన్న చంద్రన్న బీమాను తాజాగా 10 లక్షలు పెంచారు. బీమా మిత్రలను కొనసాగిస్తే తమ కుటుంబాల్లో వెలుగు నింపిన వారవుతారని చెబుతున్నారు. మంగళవారం చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పంకు రానున్న నేపథ్యంలో తమను కొనసాగించే విషయమై పునరాలోచించాలని చంద్రబాబు హయాంలో బీమా మిత్రులుగా చేసిన వారు వేడుకొంటున్నారు.

2014లో సిఎంగా బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబునాయుడు చంద్రన్నబీమా పథకాన్ని ప్రవేశపెట్టారు. రూ.15కే బీమా వర్తించేలా, కుటుంబంలో 18–60లోపు వయస్సు గల ప్రతి ఒక్కరికీ వర్తించేలా చేశారు. కుటుంబ సభ్యులు సహజ మరణం చెందితే రెండు లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షల బీమా వర్తింపజేసింది. లబ్ధిదారులకు బీమాను అందించేందుకు 2014లో బీమా మిత్రులను డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసింది. ప్రతి మండలానికి ఇద్దరు, మున్సిపాలిటీ పరిధిలో ఐదుగురు, కార్పొరేషన్‌లో పది మందికి పైగా బీమా మిత్రులను నియమించి లబ్ధిదారులకు సకాలంలో బీమా అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 2019లో రాష్ట్రంలో వైఎసఆర్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బీమా మిత్రులను తొలగించారు. ఆ సేవలను సచివాలయ సిబ్బందికి అప్పగించి, బీమా మిత్రుల వ్యవస్థను రద్దు చేశారు. దీంతో బీమా మిత్రులు ఉపాధిని కోల్పోయి ఇంటి దారి పట్టారు. అనేకమార్లు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా న్యాయం చేయాలని బీమా మిత్రులు వాపోయారు. ప్రస్తుతం తిరిగి చంద్రబాబు అధికారంలోకి రావడంతో వారిలో తిరిగి ఆశలు చిగురించాయి.

2024లో చంద్రబాబునాయుడు విజయఢంకా మోగించారు. ముఖ్యమంత్రిగా తిరిగి బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రంలో చంద్రన్నబీమా పథకం మళ్లీ వెలుగులోకి వస్తుందని, ఐదు లక్షలుగా ఉన్న బీమాను 10 లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించారు. తమ ఉపాధిపైనా పునరాలోచించాలని బీమా మిత్రులు కోరుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 66 మండలాలకు కలిపి 120 మంది బీమా మిత్రలు ఉండేవారు. కార్పొరేషన్‌లో 200 మంది ఉండేవారు. వీరందరినీ వైసిపి ప్రభుత్వం తొలగించింది. రాష్ట్రవ్యాప్తంగానూ దాదాపు వీరి సంఖ్య రెండువేల పైనే ఉంటుంది. చంద్రన్న బీమా మిత్రులపై కరుణ చూపాలని వేడుకొంటున్నారు.

2004 నుంచి పనిచేస్తున్నాం



రాజ్యలక్ష్మి, తిరుపతి రూరల్

2004వ సంవత్సరంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇందిరాగాంధీ పేరిట బీమా పథకాన్ని ప్రవేశపెట్టారు. అప్పటినుంచి బీమా మిత్రులుగా ఉన్నాం. 2019లో వైసిపి అధికారంలోకి రాగానే మమ్మల్ని తొలగించేశారు. మళ్లీ చంద్రన్న పాలన రావడంతో న్యాయం చేస్తారనే నమ్మకం ఉంది.

రోడ్డున పడేశారు



కవిత, తిరుపతి అర్బన్

గత 14 సంవత్సరాలుగా బీమా పథకంలో బీమా మిత్రులుగా పనిచేశాను. 2019లో చంద్రన్న బీమా పథకాన్ని తొలగించారు. బీమా మిత్రులను రాష్ట్రవ్యాప్తంగా తొలగించి రోడ్డున పడేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మహిళా బీమా మిత్రులైన తమపై దయచూపి న్యాయం చేయాలని కోరుకుంటున్నాం.

సానుభూతిపరులమనే తొలగించారు



నవనీత, వడమాలపేట

పేద ప్రజలకు చంద్రన్న బీమా ద్వారా సేవలందించే బీమా మిత్రులను 2019లో వైసిపి ప్రభుత్వం తొలగించింది. మేమంతా టిడిపి సానుభూతివరులమని మాపై ముద్ర వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చంద్రన్న బీమా మిత్రులపై కరుణ చూపి, బీమా మిత్రుల వ్యవస్థను కొనసాగించి ఉపాధి చూపాలని వేడుకొంటున్నాం.

మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్



ప్రజాశక్తి - సత్యవేడు: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో రైతులను ప్రభుత్వం ప్రోత్సహించి ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మామిడి చెట్లు పెంపకానికి ఉచితంగా చెట్లు నాటిన ప్రభుత్వం నేడు కార్పొరేట్ కంపెనీలు దయాదక్షిణ్యాలపై రైతులు తమ పంటను అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్లో మామిడి గుజ్జుతో తయారైన రసాలకు ఏమాత్రం ధర తగ్గక పోయినా రైతుల నుంచి సేకరించే మామిడి కాయల ధరను మాత్రం తగ్గించి డిమాండ్ లేదనే సాకుతో తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ రైతులను నష్టపరిచే విధంగా జ్యూస్ పరిశ్రమ యాజమాన్యాలు రైతులను దోచేస్తుంటే ప్రభుత్వాలు తమకేమీ పట్టనట్లు ఉండడం సరికాదన్నారు. చిత్తూరు కలెక్టర్ స్పందించి టన్ను 30 వేల రూపాయలకు తోతాపురిని కొనుగోలు చేయాలని పరిశ్రమల యాజమాన్యాన్ని ఆదేశించినా ఫలితం లేదని, తక్కువ ధరకే సేకరిస్తున్నారని పేర్కొన్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున పురుగులు పట్టి చెడిపోతాయని రైతులు ఆందోళనతో వచ్చినంత సొమ్ముకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకున్న యాజమాన్యాలు తక్కువ ధరకే కొంటున్నాయని తెలిపారు. నూతన ప్రభుత్వం రైతుల కోసం పరిశ్రమ యజమానులతో సంప్రదించి గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ


ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్సు అధికారి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలం లోని పల్లమాల సచి వాలయంలో మాతా శిశు మరణాల నివారణపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం బుచ్చిరాయుడు కండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా టాస్క్‌ఫోర్సు అధికారి డాక్టర్ శ్రీనివాస రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. ఆయన నేతృత్వంలో జిల్లా గణాంక అధికారి నాగేంద్ర డిపిహెచ్ఎన్ ఇన్‌ఛార్జి బేబీ రాణి, డిపిఓ ప్రకాష్, మండల బిఎన్ కండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను సందర్శించి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు, గర్భిణులు, బాలింతలు, రక్తహీనతతో మృతి చెందకుండా జాగ్రత్త వహించి వారికి తగిన వైద్య సదుపాయాలు కల్పించి రక్తహీనత లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి కాన్పు ప్రభుత్వ హాస్పిటల్లోనే నిర్వహించు కునేలా చూడాలన్నారు. బుచ్చి నాయుడు కండిగ గ్రామం లోని గర్భిణులకు, యుక్త వయసు పిల్లలకు హిమో గ్లోబిన్ పరీక్షలు చేసి తక్కువగా ఉన్న వారికి తగిన సలహాలు, సూచన లు ఇవ్వాలని కోరారు. అంగన్‌వాడీలలో బాలింతలకు, గర్భిణులకు ఇచ్చే బలవర్ధక ఆహారాన్ని తప్పకుండా ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలోఏఎన్ఎం, ఎమ్మెల్ హెచ్‌పిఓలు రికార్డుల పనితీరును పరిశీలించి వారికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిపిఓ ప్రకాష్, వైద్యాధికారి డాక్టర్ దివాకర్, సచివాలయ సిబ్బంది సూపరువైజర్స్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాశింకు ఘన స్వాగతం


ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించి ప్రమాణ స్వీకారం చేసేందుకు అసెంబ్లీకి వెళ్లి సమావేశాల్లో పాల్గొని సోమవారం నియోజక వర్గానికి చేరుకున్న ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ కు టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. గూడూరు విఘ్నేశ్వరపురం నుండి గాంధీ బొమ్మ , రాజా వీధి మీదుగా టవర్ క్లాక్ సెంటర్ మీదుగా పార్టీ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అనంతరం టిడిపి నేతలు బాణ సంచా పేల్చి , స్వీట్లు పంచిపెట్టారు. క్రేన్ సాయంతో గజమాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడూరు నియోజవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిదన్నారు. తనపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని వారి సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుం డా కృషి చేస్తానని పేర్కొ న్నారు. గూడూరు పట్టణంలో మౌలిక వస తుల కల్పనకు , పార్టీ ఆఫీసులో కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గూడూ రు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం అని పేర్కొన్నారు. గూడూరు మున్సిపాల్టీ ఎన్నికలు నిర్వహించేలా అధిష్టానంతో మాట్లాడుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తానంకి నానాజీ , సోమిశెట్టి చెంచు రామయ్య, చాన్ బాషా, వాటంబేడు శివ కుమార్ , సోమిశెట్టి సాయి కృష్ణ , పులిమి శ్రీనివాసులు, అబ్దుల్ రహీమ్, నెలబల్లి భాస్కర్ రెడ్డి , బయ్య మోహన్ రావు పాల్గొన్నారు.

జక్కంరెడ్డి సేవలు స్ఫూర్తిదాయకం

- బీటెక్ విద్యార్థి వైద్యానికి రూ.40వేల ఆర్థిక సాయం
- లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ ఛైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్



విద్యార్థి వైద్యానికి ఆర్థిక సాయం అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : సీనియర్ లయన్ జక్కంరెడ్డి శ్రీనివాసులురెడ్డి సేవలు స్ఫూర్తి దాయకమని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ ఛైర్మన్ షేక్ రియాజ్ అహ్మద్ అన్నారు. గూడూరు డీఎన్ఆర్ కమ్యూనిటీ ఆడిటోరియంలో బీటెక్ విద్యార్థి వైద్య ఖర్చులకు లయన్స్ క్లబ్ సభ్యులతో కలిసి సోమవారం 40 వేల రూపాయలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఓజిలి మండలం పెద్ద పరియ గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి బుస్సారెడ్డి రేవంత్ రెడ్డి ప్రమాదవశాత్తు చెట్టుపై నుండి పడిపోయాడన్నారు. దీంతో వెన్నెముక దెబ్బతిందన్నారు. పేద విద్యార్థి వైద్యం కోసం లయన్స్ క్లబ్ తరపున రూ.20 వేలు, సీనియర్ లయన్ జక్కం రెడ్డి శ్రీనివాసులురెడ్డి రూ.20వేలు కలిపి 40 వేల రూపాయలు రేవంత్ రెడ్డి తండ్రి శ్రీనివాసులురెడ్డికి అందించా మన్నారు. జక్కంరెడ్డి ఔదార్యం అభినందనీ యమన్నారు. లయన్స క్లబ్ అధ్యక్షుడు రవి చంద్ర, డిస్ట్రిక్ ఛైర్మన్ మల్లెమాల మురళీరెడ్డి, వాకాటి రామ్మోహన్ రావు తదితరులు బీటెక్ విద్యార్థి రేవంత్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సీనియర్ లయన్ జక్కంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమానికి తనవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు మదన మేటి రమణయ్య, కళ్యాణ్ సాయి, రూపేష్ రెడ్డి, వీరేంద్ర నాథ్ పాల్గొన్నారు.

రెండు గ్రామాల మధ్య క్రికెట్ వివాదం

- వెదురుకుప్పం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు

ప్రజాశక్తి - వెదురుకుప్పం: సరదాగా రెండు గ్రామాల మధ్య జరిగిన క్రికెట్ ఆట వివాదానికి దారితీసింది. సోమవారం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదుకు వరకు వెళ్ళింది. ఇందుకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. వెదురుకుప్పం మండలం వావిలిచేను గ్రామం, మారేపల్లి దళితవాడకు చెందిన యువకులు ఆదివారం సాయంత్రం సరదాగా క్రికెట్ మ్యాచ్ ఆడారు. ఈ ఆటలో స్కోర్ దగ్గర ఇరు గ్రామాల మధ్య వివాదం తలెత్తింది. గొడవపడ్డారు. సమీపంలో ఉన్న పెద్దలు జోక్యం చేసుకొని ఇరువురికి సర్దిచెప్పి పంపించేశారు. అయితే మారేపల్లి దళితవాడకు చెందిన యువకులు ఆ గ్రామానికి వెళ్లి మరి కొంతమందిని వెంటపెట్టుకొని వావిలిచేను గ్రామంలో యువకులపై దాడికి పాల్పడ్డారు. గ్రామం అంత ఏకమై మారేపల్లి దళితవాడ యువకులపై తిరిగి దాడి చేశారు. ఆ గ్రామం నుంచి వెళ్లి మారేపల్లి గ్రామస్తులతో కలిపి వావిలిచేను గ్రామంలో యువకులపై వెదురుకుప్పం పోలీస్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆ గ్రామస్తులు ఏదైనా ఆట సరదాగా ఉండాలే గాని, గొడవలకు దారి తీసే విధంగా ఉండకూడదని చెబుతున్నారు.

ఏపీ ఆర్ సెట్ 2023-24 ఇంటర్వ్యూలు ప్రారంభం

ప్రజాశక్తి - క్యాంపస్ : రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పీహెచ్‌డీ ప్రవేశానికి చేపట్టిన ఏపీ ఆర్‌సెట్ 2023 –24 ఇంటర్వ్యూలు ఈ నెల 24వ తేదీ నుండి ప్రారంభమయ్యాయని ఏపీ ఆర్ సెట్ కన్వీనర్ బి దేవప్రసాదరాజు సోమవారం పేర్కొన్నారు. 24వ తేదీ నుండి 28 వ తేదీ వరకూ ఇంటర్వ్యూలు వుంటాయని తెలిపారు. రాష్ట్రంలో ఎంపిక చేసిన 12 యూనివర్సిటీల్లో ఇంటర్వ్యూల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. పీహెచ్‌డీలో ప్రవేశానికి 10 వేల మంది దరఖాస్తు చేయగా, వీరిలో 4,352 మంది ఉత్తీర్ణత పొంది ఇంటర్వ్యూలకు హాజరు కానున్నారు. ఆయా యూనివర్సిటీల్లోని సంబంధిత డిపార్టుమెంట్లలో ఇంటర్వ్యూ చేపడతారు. సమగ్ర వివరాలు కోసం.. హెచ్ టిటి పి// సెట్స్. ఏపీఎస్‌సిహెచ్ఇ. ఏపీ.జిఒవి.ఇన్ లో చూడవచ్చని కన్వీనర్ తెలిపారు.

తెలుగులో ప్రమాణ స్వీకారం హర్షదాయకం

ప్రజాశక్తి-గంగవరం: తెలుగు రాష్ట్రానికి చెందిన పార్లమెంట్ సభ్యులు శాసనసభ్యులు తెలుగు భాషలో ప్రమాణ స్వీకారం చేసినందుకు తెలుగు సాహిత్య సేవా సమితి అధ్యక్షులు తులసినాథం నాయుడు హర్షం వ్యక్తం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో విద్య హక్కు చట్టం, జాతీయ విద్యా విధానం 2020 చట్టం ప్రకారం పాఠశాలల స్థాయిలో మాతృభాష మాధ్యమంలోని అన్ని ప్రైవేటు పాఠశాలలలో విద్యాబోధన జరిగేలా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులకు శాసనసభ్యులకు అభినందనలు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రూ.10వేల జరిమానా

ప్రజాశక్తి-చిత్తూరు డెస్క్: మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో ముద్దాయికి రూ.10 వేలు జరిమానా విధిస్తూ నగరి జూనియర్ సివిల్ జడ్జి ఎస్.విష్ణువర్మ సోమవారం తీర్పును ఇచ్చారు. సీఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు నింద్ర మండలం ఆలపాకం దళితవాడకు చెందిన ఇ.గుణశేఖర్ మద్యం సేవించి వాహనం నడుపుతుండగా పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. ఆ కేసును విచారించిన జడ్జి విష్ణువర్మ ముద్దాయికి రూ.10వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో ముద్దాయికి జైలు శిక్ష విధించడం జరుగుతుందని కోర్టు సిబ్బంది తెలిపారు.

మంత్రి లోకేష్‌ని కలిసిన సందాని



ప్రజాశక్తి-వెదురుకుప్పం: మంత్రి నారా లోకేష్‌ను చిత్తూరు పార్లమెంట్ మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరి షేక్ సందాని మర్యాదపూర్వకంగా కలిశారు. అమరావతిలోని మంత్రి ఛాంబర్‌లో సోమవారం నారా లోకేష్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రికి సందాని శుభాకాంక్షలు తెలిపారు.

రాణెమ్మకు నివాళి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని తిప్పినాయుడుపల్లి సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి తల్లి రాణెమ్మ(53) హఠాత్తుగా సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి గ్రామానికి చేరుకుని ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట స్థానిక వైసీపీ నాయకులు ఉన్నారు.